సాక్షి
యాదాద్రి భువనగిరి
గురువారం । 15 । జూన్ । 2023



**ఖిలా.. దశ తిరిగేలా**
భువనగిరి ఖిలాను అభివృద్ధి చేసేందుకు కేంద్రం స్వదేశీదర్శన్-2 లో భాగంగా రూ.100 కోట్లు కేటాయించింది. - 4లో



**దశాబ్దాల కల సాకారం**
నుద్దాల- పల్లెపహాడ్ గ్రామాలను కలుపుతూ బిక్కేరు వాగుపై నిర్మించిన బ్రిడ్జి నేడు ప్రారంభం కానుంది. - 5లో

**వాతావరణం**
గరిష్ఠం/కనిష్ఠం 41°/30°
పాక్షికంగా మేఘవృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఉష్ణోగ్రత ఎక్కువగా ఉండడం వల్ల ఉక్కపోతగా ఉంటుంది.

## న్యూస్‌రీల్

### రక్తదాతకు గవర్నర్ ప్రశంస



అహ్మద్‌కు ప్రశంసాపత్రం అందజేస్తున్న గవర్నర్ తమిళిసై సౌందరరాజన్

మోత్కూరు: ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా సభ్యుడు, మోత్కూరుకు చెందిన ఎండీ అహ్మద్ ఇప్పటివరకు 54సార్లు రక్తదానం చేశారు. ప్రపంచ రక్త దాతల దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా అహ్మద్‌ను ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ లక్ష్మీనర్సింహారెడ్డి అభినందించారు.

### యాదాద్రీశుడికి లక్ష పుష్పార్చన



స్వామివారికి లక్ష పుష్పార్చన నిర్వహిస్తున్న ఆచార్యులు

యాదగిరిగుట్ట: ఏకాదశిని పురస్కరించుకొని యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో బుధవారం లక్ష పుష్పార్చన వేడుకలు పాంచరాత్ర ఆగమశాస్త్ర ప్రకారం నిర్వహించారు. ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చన మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి లక్ష పుష్పార్చన పూజలు జరిపించారు. తులసీ దళాలతో శ్రీస్వామి అమ్మవార్లను విశేషంగా పూజించారు. ఇక ఆలయంలో స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు ఉదయం నుంచి రాత్రి వరకు నిత్య పూజలు విశేషంగా కొనసాగాయి. ఆలయ మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, నిత్య కల్యాణం, గజవాహనసేవ, బ్రహ్మోత్సవం, వెండి జోడు సేవలను వైభవంగా నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. వివిధ పూజలతో శ్రీస్వామి వారికి నిత్యాదాయం రూ.24,10,359 వచ్చినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు.

### టీచింగ్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

భువనగిరి: భువనగిరిలోని బాలుర, ఆలేరులోని బాలికల, చౌటుప్పల్‌లోని బాలుర మైనార్టీస్ గురుకుల జూనియర్ కళాశాలల్లో ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో టీజీటీ, పీజీటీగా పనిచేసేందుకు అర్హులైన వారు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా ఎంప్లాయిమెంట్ అసిస్టెంట్స్ మిషన్ సభ్యులు శాంతిశ్రీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలేరు గురుకుల కళాశాలలో తెలుగు, జువాలజీ, ఉర్దూ, బయాలజీ, భువనగిరి బాలుర కళాశాలలో పీజీటీ ఫిజికల్ సైన్స్, చౌటుప్పల్ బాలుర కళాశాలలో టీజీటీ గణితం, స్టాఫ్ నర్స్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. విద్యార్హతకు సంబంధించిన సర్టిఫికెట్లతోపాటు, ఇతర ధ్రువీకరణ పత్రాలు ఈ నెల 21వ తేదీ సాయంత్రంలోపు జిల్లా ఉపాధి కల్పనాధికారి కార్యాలయంలో అందజేయాలని కోరారు.

# ఐటీ కలకలం



ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి నివాసంలో ఐటీ దాడులను నిరసిస్తూ భువనగిరిలో ప్రధాని నరేంద్రమోదీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

- హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి నివాసంలో ఐటీ సోదాలు
- బీజేపీ కుట్రేనని బీఆర్‌ఎస్ ఆరోపణ
- భువనగిరి నియోజకవర్గ వ్యాప్తంగా ఆందోళనకు దిగిన కార్యకర్తలు

సాక్షి, యాదాద్రి: హైదరాబాద్‌లోని భువనగిరి ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి నివాసం, కార్యాలయంలో ఆదాయపన్ను శాఖ అధికారులు ఏకకాలంలో సోదాలు చేయడం జిల్లాలో ఒక్కసారిగా చర్చనీయాంశంగా మారింది. ఈ దాడులను బీఆర్‌ఎస్ శ్రేణులు తీవ్రంగా ఖండిస్తున్నాయి. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కక్షపూరితంగా ఇన్‌కమ్ ట్యాక్స్ అధికారులతో దాడులు చేయిస్తుందని ఆరోపిస్తూ బుధవారం భువనగిరి నియోజకవర్గం వ్యాప్తంగా ఆందోళనకు దిగాయి. కేంద్ర ప్రభుత్వం, ప్రధాని నరేంద్రమోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు.

**భగ్గుమన్న బీఆర్‌ఎస్ శ్రేణులు**

తమ పార్టీ ఎమ్మెల్యే చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక బీజేపీ ఐటీ శాఖ ద్వారా దాడులు చేయిస్తుందని బీఆర్‌ఎస్ ఆరోపిస్తోంది. ఐటీ సోదాలు జరుగుతుండగానే నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ శ్రేణులు బీజేపీ, కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మలను దహనం చేశారు. ప్రజల్లో భువనగిరి ఎమ్మెల్యేకు పెరుగుతున్న ఆదరణను చూసి తట్టుకోలేకే ఈ దాడులు చేయిస్తున్నారని ఆరోపిస్తున్నారు.

**మరికొన్ని సోదాలు జరిగే అవకాశం**

గతంలోను జిల్లాలో పలుమార్లు ఐటీ దాడులు జరిపారు. భువనగిరికి చెందిన ప్రముఖ మహిళా వైద్యశాలపై దాడులు చేశారు. అలాగే యాదగిరిగుట్ట ప్రాంతంలో రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేసే స్పెక్ట్రా సంస్థల కార్యాలయం, డైరెక్టర్ల ఆస్తులపై వరుస దాడులు నిర్వహించారు. ఆలేరు నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నేత ఇంటిపై ఆదాయపు పన్ను శాఖ అధికారులు దాడులు చేయడం అప్పట్లో సంచలనం రేపింది. తాజాగా అధికార పార్టీ ఎమ్మెల్యే వ్యాపారాలపై ఆదాయపన్ను శాఖ దాడులు చేయడం జిల్లాలో తీవ్ర సంచలనం సృష్టిస్తోంది. అయితే జిల్లాలో ఆదాయపు పన్ను శాఖ మరికొన్ని దాడులకు దిగే అవకాశం ఉందన్న ప్రచారం జరుగుతోంది. రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసే ప్రముఖులు కొందరు ప్రధాన రాజకీయ పార్టీల్లో కొనసాగుతున్నారు. వీరిపై కూడా దాడులు జరిగే అవకాశం ఉందని ప్రచారం.

**వ్యాపార లావాదేవీలపై నజర్**

ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి తీర్థ గ్రూప్స్ పేరిట హైదరాబాద్, కర్నాటకతో పాటు దక్షిణాఫ్రికాలో రియల్ ఎస్టేట్, మైనింగ్, లీథియం, సోలార్ వ్యాపారాలు చేస్తున్నట్లు అధికారుల వద్ద సమాచారం ఉంది. అదేవిధంగా ఆయన సతీమణి హిల్ ల్యాండ్ డిజిటల్ టెక్నాలజీ, మెయిన్ లాండ్ డిజిటల్ టెక్నాలజీ కంపెనీలకు డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. ఆయా వ్యాపారాలకు సంబంధించిన ఆర్థిక లావాదేవీలపై ఐటీ శాఖ దాడులకు దిగినట్లు తెలుస్తోంది. అలాగే మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి ఇళ్లు వ్యాపార లావాదేవీలపై ఏకకాలంలో బుధవారం ఉదయం 6 గంటల నుంచి ఐటీ దాడులు ప్రారంభించారు.

## రైతు రాజ్యమంటే రైతులకు బేడీలు వేయడమా?



బెయిల్‌పై విడుదలైన రైతులను కలిసి సన్మానించిన పీవీ శ్యాంసుందర్‌రావు, గూడూరు నారాయణరెడ్డి

- పోలీస్ వ్యవస్థ ప్రభుత్వానికి తొత్తుగా వ్యవహరిస్తోంది
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు పీవీ శ్యాంసుందర్‌రావు

సాక్షి, యాదాద్రి : రైతు రాజ్యం అంటే రైతులకు బేడీలు వేయడమా.. అని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పీవీ శ్యాంసుందర్‌రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. జైలు నుంచి విడుదలైన రాయగిరికి చెందిన రైతులు గడ్డమీది మల్లేష్, పల్లెర్ల యాదగిరి, అవిశెట్టి నిఖిల్, మల్లెబోయిన బాలనర్సింహను బుధవారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గూడూరు నారాయణరెడ్డితో కలిసి పరామర్శించి సన్మానించారు. ఈ సందర్భంగా శ్యాంసుందర్‌రావు మాట్లాడుతూ.. టెర్రరిస్టుల మాదిరిగా రైతులకు బేడీలు వేసి కోర్టుకు తీసుకురావడం ప్రజలకు పోలీసులు వ్యతిరేకంగా పనిచేస్తున్నట్లు తేటతెల్లమవుతుందన్నారు. పోలీసు వ్యవస్థ రాష్ట్ర ప్రభుత్వానికి తొత్తుగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. రాష్ట్రంలో ఉన్నది ప్రభుత్వమా లేక నలుగురు వ్యక్తులతో కూడిన కుటుంబ పాలనా అని ప్రశ్నించారు. ప్రభుత్వ చర్యలను తెలంగాణ రైతు సమాజం గమనిస్తుంద న్నారు. తాము కోల్పోతున్న పంట పొలాల భూములు ఇవ్వమని కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తే అక్రమ కేసులు పెట్టి జైల్లో పెట్టించడం సరికాదన్నారు. ఎవరి కంపెనీల రేట్లు పెంచడానికి రీజినల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్చారో సమాధానం చెప్పాలని మంత్రి జగదీశ్ రెడ్డి స్థానిక ఎమ్మెల్యే శేఖర్ రెడ్డిని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరించిందన్నారు. ఆయన వెంట బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నర్ల నర్సింగరావు,కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడమటి జగన్‌మోహన్‌రెడ్డి, ఉపేందర్, నర్సింహాచారి, మహమూద్ పాల్గొన్నారు.

## మహిమాన్విత క్షేత్రం తిరుమలనాథ ఆలయం

- త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్ స్వామి



ప్రవచిస్తున్న చినజీయర్ స్వామి

బొమ్మలరామారం: శ్రీతిరుమలనాథ స్వామి ఆలయం మహిమాన్విత పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతుందని త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్ స్వామి తెలిపారు. బుధవారం బొమ్మలరామారం మండలంలోని చీకటిమామిడి గ్రామంలో గల శ్రీ తిరుమలనాథ స్వామి ఆలయంలో స్వామి విగ్రహ పునఃప్రతిష్ఠ ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా చినజీయర్ స్వామి ఆలయంలో మహా పూర్ణాహుతి, మహా కుంభ సంప్రోక్షణ, ప్రాణ ప్రతిష్ఠ, ప్రథమారాధన, విమాన శిఖర కలశ ప్రతిష్ఠ, శాంతి కల్యాణం, గర్భగుడిలో యంత్ర ప్రతిష్ఠ కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులకు దివ్య ప్రవచనాలు చేశారు. నూతనంగా ఆలయాలు నిర్మించడం కన్నా జీర్ణోదయ స్థితికి చేరుకున్న పురాతన ఆలయాలను పునర్నిర్మిస్తే వంద నూతన ఆలయాలు నిర్మించనట్టేనని పేర్కొన్నారు. పురాతన చరిత్ర గల ఆలయాలను కాపాడుకోవాలన్నారు. కృష్ణశిలతో పునర్నిర్మించిన శ్రీ తిరుమల నాథస్వామి ఆలయం అద్భుతంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో మచ్చ శ్రీనివాస్ గౌడ్, బల్‌రాం గౌడ్, మల్లా గౌడ్, మచ్చ శ్రీదేవి చంద్రమౌళి గౌడ్, సర్పంచ్ మచ్చ వసంతా శ్రీనివాస్‌గౌడ్, ప్రీతమ్ గౌడ్, ఆలయ కమిటీ చైర్మన్ రాగుల బల్‌రాం, ఈఓ నరేందర్, ఆలయ అర్చకులు కాండూరి లక్ష్మీనారసింహాచార్యులు, రంగారామాగౌడ్, గుల్లని మహేష్, బుడిద రమేష్ గౌడ్, రామచంద్రయ్య గుప్త, జమాల్, తిర్మణి నాగరాజు, భూపతి శ్రీనివాస రావు, బొర్ర నర్సింహ, శెట్టి గౌడ్, తిప్పారం భానుప్రకాష్, సాయిగౌడ్ పాల్గొన్నారు.

**స్వామివారిని దర్శించుకున్న ప్రముఖులు**

శ్రీ తిరుమలనాథ స్వామి విగ్రహ పునఃప్రతిష్ఠాపనకు ప్రభుత్వ విప్ గొంగిడి సునీత, జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.

## కార్పొరేట్ స్థాయిలో వైద్యసేవలు



వైద్యారోగ్య దినోత్సవంలో కేసీఆర్ కిట్‌ను చూపుతున్న ప్రభుత్వ విప్ గొంగిడి సునీత తదితరులు

- ప్రభుత్వ విప్ గొంగిడి సునీత

ఆలేరురూరల్: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఆరోగ్య తెలంగాణ, వైద్య ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆలేరు సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రభుత్వ విప్ గొంగిడి సునీత సందర్శించారు. రోగుల బాగోగులు, ఆరోగ్య పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. వారికి పండ్లు పంపిణీ చేశారు. వైద్యుల పనితీరు బాగుందని కొనియాడారు. అనంతరం దొంతిరి సోమిరెడ్డి ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన వైద్య ఆరోగ్య దినోత్సవంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో కార్పొరేట్ స్థాయిలో వైద్యసేవలు అందుతున్నాయని తెలిపారు. సీఎం కేసీఆర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకొని వైద్య ఆరోగ్యశాఖను బలోపేతం చేశారన్నారు. ఆస్పత్రుల్లో గర్భిణులు, నవజాతి శిశువులకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి కేసీఆర్ కిట్ పథకాన్ని ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ఆలేరు నియోజకవర్గంలో 58 ఆరోగ్య ఉపకేంద్రాల ఏర్పాటుతోపాటు, 16 బీఎఎంఎస్ వైద్యులను, 14 సోట్ఫ్ నర్సులను నియమించామన్నారు. పల్లె దవాఖానాల్లో 105 రకాల మందులు, 14 రకాల రోగ నిర్ధారణ పరీక్షలను అందుబాటులో ఉంచామన్నారు. ఆలేరు నియోజకవర్గంలో 37 ఆరోగ్య ఉప కేంద్రాలకు కొత్త భవనాల నిర్మాణానికి అనుమతులు వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ నాగిరెడ్డి, జెడ్పీటీసీ నాగిరెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ యశోధ, జెడ్పీటీసీ కుడుదుల నగేష్, మున్సిపల్ చైర్మన్ శంకరయ్య, ఆలేరు సీహెచ్‌సీ సూపరింటెండెంట్ నిఖిల, డాక్టర్ నవీన్, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, ఎంపీపీలు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డిపై ఐటీ దాడులు.. కుట్రే

- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి

సాక్షి, యాదాద్రి: ఎలాంటి అవినీతి ఆరోపణలు లేని భువనగిరి ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డిపై ఐటీ దాడులు కుట్రపూరితమేనని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి ఆరోపించారు. బుధవారం ఆయన జిల్లా కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. నిజాయితీగా ప్రజల కోసం పనిచేస్తున్న ఎమ్మెల్యేపై బీజేపీ స్వార్థ రాజకీయాల కోసం ఐటీ దాడులకు దిగిందన్నారు. ఎన్నికల లబ్ధికోసమే ఎమ్మెల్యేల వ్యాపార సంస్థలు, ఇళ్లపై దాడులు చేస్తూ భయభ్రాంతులకు గురిచేస్తుందన్నారు. బీజేపీ ఎన్ని జిమ్మిక్కులు చేసినా రాష్ట్రంలో ప్రజాదరణ పొందలేకపోతుందన్నారు. వ్యాపారం చేయడం కూడా నేరమేనా అని ప్రశ్నించారు. ఎవరితో ఎన్ని దాడులు చేయించినా బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు పైళ్ల శేఖర్‌రెడ్డి, మర్రి జనార్దన్‌రెడ్డి, కొత్త ప్రభాకర్‌రెడ్డి కడిగిన ముత్యంలా బయటకు వస్తారని తెలిపారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ జడల అమరేందర్ గౌడ్, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు అమరేందర్, మున్సిపల్ చైర్మన్ ఆంజనేయులు, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎడ్ల రాజేందర్‌రెడ్డి ఉన్నారు.

## కృత్రిమ గర్భధారణతో మేలుజాతి దూడలు



దూడల ప్రదర్శన నిర్వహిస్తున్న అధికారులు

భూదాన్‌పోచంపల్లి: కృత్రిమ గర్భధారణతో మేలుజాతి దూడలు జన్మిస్తాయని జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఈఓ డాక్టర్ పాశం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం భూదాన్‌పోచంపల్లి మండలంలోని పిలాయిపల్లి గ్రామంలో ఉన్న గోపాలమిత్ర కేంద్రంలో జిల్లా పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో కృత్రిమ గర్భధారణ ద్వారా జన్మించిన దూడల ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక వైద్యాధికారి అశోక్ బాబు, సర్పంచ్ అందెల హరీష్, ఎంపీటీసీ బందారపు సుమలత లక్ష్మణ్‌గౌడ్, సూపర్‌వైజర్ సీహెచ్ గిరి, గోపాలమిత్రలు కొమ్మన బాలనర్సింహ, బాత్క రాజు, గుర్రాల వేణుగోపాల్, సురేశ్, లింగస్వామి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

- హాజరైన 150 మంది విద్యార్థులు

భువనగిరి: పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు బుధవారం జిల్లా వ్యాప్తంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు జరిగిన పరీక్షకు మొత్తం 189 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 150 మంది హాజరయ్యారు. 39 మంది గైర్హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 6 కేంద్రాలను ఫ్లయింగ్ స్క్వాడ్స్ పరిశీలించినట్లు డీఈఓ నారాయణరెడ్డి తెలిపారు.



# ఇందిరమ్మ కాలనీలో నీటిగోస

- కొన్ని ఇళ్లకు మాత్రమే నల్లా కనెక్షన్
- వీటికి కూడా సరఫరా కాని నీరు
- వృథాగా భగీరథ నీటి ట్యాంకు
- మూడు రోజులకోసారి ట్యాంకర్ ద్వారా సరఫరా చేస్తున్న మున్సిపాలిటీ



ఇంటి ఎదుట ఏర్పాటు చేసిన డ్రమ్ములు



నిరుపయోగంగా ఉన్న భగీరథ ట్యాంక్

భువనగిరిటౌన్: భువనగిరి పట్టణం దినదినాభివృద్ధి చెందుతోంది. దీనికి అనుగుణంగా మున్సిపాలిటీ పరిధిలో అన్ని వార్డులు అభివృద్ధి చెందుతున్నాయి. కానీ పట్టణ శివారులో ఉన్న హుసేనాబాద్, బస్వాపురం గ్రామాలకు మధ్య ఉన్న ఇందిరమ్మ కాలనీలో నీటికి ఇబ్బందులు తప్పడం లేదు. నేటికీ మున్సిపాలిటీ ట్యాంకర్ ద్వారా ప్రతి ఇంటికి మూడు డ్రమ్ముల చొప్పున మూడు రోజులకు ఒక సారి మాత్రమే సరఫరా చేస్తున్నారు. శుభకార్యాలు, పండుగలు జరిగినప్పుడు మాత్రం నీటి గోస తప్పదని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యేక ట్యాంకర్లతో నీటిని తెప్పించుకోవాల్సిన పరిస్థితి నెలకొంటుందని చెబుతున్నారు.


**14 సంవత్సరాల క్రితం కాలనీ ఏర్పాటు**

భువనగిరి పట్టణ శివారులో 14 సంవత్సరాల క్రితం అప్పటి కాంగ్రెస్ పార్టీ హయాంలో ఇందిరమ్మ కాలనీ ఏర్పాటైంది. ప్రస్తుతం సుమారు 100 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. సుమారు 500 మంది జనాభా ఉంది. నీటి వసతి లేకపోవడంతో పలువురు తాము నిర్మించుకున్న ఇళ్లలో ఉండడం లేదు. నీటి సరఫరా సరిగా లేక వివిధ రకాల చర్మ సమస్యలు వస్తున్నాయని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చాలా మంది ఇళ్లల్లో అద్దెకు ఉంటున్న వారు నీటి సమస్య కారణంగా ఇళ్లు ఖాళీ చేసి వెళ్లిపోతున్నారు.

**ట్యాంక్ నిర్మించినా..**

ఇందిరమ్మకాలనీలో నీటి సరఫరాకు రెండు సంవత్సరాలు క్రితం మంచినీటి ట్యాంకును నిర్మించారు. కానీ దీనిని వినియోగంలోకి తీసుకురాలేదు. నల్లా కనెక్షన్ కూడా కొన్ని ఇళ్లకు మాత్రమే ఇచ్చారు. మిగతా చోట్ల పైపులైన్ వేయలేదు. కనీసం నల్లా కనెక్షన్ ఇచ్చిన ఇళ్లకు అయినా నీరు సరఫరా చేయాల్సి ఉన్నా ఎవరూ పట్టించుకోకపోవడంతో కాలనీ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**పండుగలు, శుభకార్యాల సమయాల్లో తీవ్ర ఇబ్బంది**



కాలనీలో మూడు రోజులకు ఒకసారి ట్యాంకర్ ద్వారా నీరు పోస్తారు. ఎండలు ఎక్కువగా ఉండడంతో అవి ఏ మాత్రం సరిపోవడంలేదు. పండుగ, ఇతర శుభకార్యాలు జరిగిన సమయంలో ఒక్క రోజుకు కూడా సరిపోవు. కనీసం వంట వండుకోవడానికి కూడా నీరు ఉండడం లేదు. ప్రైవేట్ ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేయించుకునే ఆర్థిక స్థోమత లేక ఉన్న దాంట్లోనే సర్దుకుపోతున్నాం.
- పాషాబీ, కాలనీవాసి

**నీటి సమస్యతో ఇల్లు ఖాళీ చేశాం**



పది సంవత్సరాల క్రితం కాలనీలో నీటి సమస్య ఉందని మేము ఇల్లు ఖాళీ చేసి వెళ్లిపోయాం. ప్రస్తుతం నూతనంగా ట్యాంక్ నిర్మాణం చేశారు. దీంతో నీరు వస్తుందనుకుని తిరిగి ఇక్కడికి వచ్చాం. కానీ నీరు సరఫరా కావడం లేదు. గతంలో మాదిరిగానే సమస్య ఉంది. ఎవరూ పట్టించుకోవడం లేదు. మంచినీటి సమస్య తీర్చే విధంగా చర్యలు తీసుకోవాలి.
- రేణుక, కాలనీవాసి

**సమస్యను పరిష్కరిస్తాం**

ఇందిరమ్మ కాలనీలో మంచినీటి సమస్యను పరిష్కరిస్తాం. మిషన్ భగీరథ పథకంలో ట్యాంకు నిర్మాణం పూర్తి చేశాం. త్వరలో దీనిని ప్రారంభిస్తాం. కాలనీ మొత్తం పైప్‌లైన్ వేసి ఇంటింటికీ నల్లా కనెక్షన్ ఇస్తాం. మంచినీటి ఇబ్బందులను తొలగిస్తాం.
- గుండెగల్ల ఎల్లమ్మ, కౌన్సిలర్


ఖిలాపై రాజుల కాలంలో నిర్మించిన మహల్



ఖిలాపైకి మెట్ల మార్గం

కళ్యాణీ చాళుక్యుల నుంచి స్వదేశీ దర్శన్‌కు..

# ఖిలా.. దశ తిరిగేలా

## క్రీ.శ.1100 ముందు నుంచే రాజుల ఏలుబడిలో భువనగిరి కోట

- పర్వతారోహణకు కేంద్రంగా..
- ఎవరెస్ట్, కిలిమంజారో, మౌంట్ ఎల్‌బ్రోస్ పర్వతాలను అధిరోహించిన ఇక్కడి శిక్షకులు
- పర్యాటకంగానూ ప్రసిద్ధి
- ఖిలా అభివృద్ధికి రూ.100 కోట్లు
- స్వదేశీ దర్శన్ –2 కింద కేటాయించిన కేంద్ర ప్రభుత్వం
- రోప్ వే, మ్యూజియం, రెస్టారెంట్లు, లేజర్ షో వంటివి ఏర్పాటు




కళ్యాణీ చాళుక్య చక్రవర్తి త్రిభువనమల్లుడి నుంచి నిజాం నవాబుల వరకు ఎన్నో చారిత్రక అంశాలకు నిలువెత్తు సాక్షి భువనగిరి ఖిలా. రాజుల కాలం ముగిసిన తర్వాత పర్యాటక కేంద్రంగా విరాజిల్లుతోంది. ఏకశిలతో నిర్మితమైన ఈ కోటను నిత్యం వందలాది మంది సందర్శిస్తుంటారు. అంతే కాదు.. అడ్వెంచర్ కేంద్రంగా యువతీయువకులు రాక్ క్లైంబింగ్, ర్యాప్లింగ్ శిక్షణ పొందుతున్నారు. ఇక్కడ శిక్షణ పొందిన పలువురు ఎవరెస్టు, కిలిమంజారో, మౌంట్ ఎల్‌బ్రోస్ వంటి ఎత్తయిన పర్వతాలను అధిరోహించి దేశ కీర్తిని ప్రపంచ నలుదిశలా చాటారు. పర్యాటలకు మరింతగా ఆకర్షించేందుకు కేంద్ర ప్రభుత్వ స్వదేశీ దర్శన్–2కింద రూ.100 కోట్లు కేటాయించింది. –సాక్షి నల్లగొండ డెస్క్


రాక్ క్లైంబింగ్ చేస్తున్న యువతి


కోటపై ఫిరంగి

చారిత్రక నేపథ్యం కలిగిన భువనగిరి ఖిలా(కోట) ఆధునిక కాలంలో పర్యాటక కేంద్రంగా, రాక్ క్లైంబింగ్, ర్యాప్లింగ్ శిక్షణకు కేరాఫ్‌గా మారింది. ఇక్కడ పర్యాటకశాఖ సహకారంతో నిర్వహిస్తున్న రాక్ క్లైంబింగ్ కోచింగ్ స్కూల్ ద్వారా వేలాది మంది పర్వతారోహణకు ఓనమాలు దిద్దారు. నానాటికీ పెరుగుతున్న పర్యాటకులను ఆకర్షించేందుకు ఇప్పటికే కోటపైకి ఉన్న మెట్ల మార్గాన్ని అభివృద్ధి చేశారు. రోప్‌వే నిర్మాణం ప్రతిపాదనలో ఉంది. వీటితో పాటు కోటపైన మౌలిక వసతులు కల్పించడానికి ప్రతిపాదనలు తయారు చేశారు. శని, ఆదివారాలు, ప్రత్యేక రోజుల్లో ఖిలాపైకి పర్యాటకులు పెద్ద ఎత్తున వస్తున్నారు. వీరి కోసం పర్యాటక శాఖ ప్రత్యేకంగా గైడ్‌ను ఏర్పాటు చేసింది.

### రూ.100 కోట్లతో చేపట్టనున్న పనులు

భువనగిరి ఖిలాను అభివృద్ధి చేయడానికి కేంద్రం స్వదేశీ దర్శన్–2లో భాగంగా రూ.100 కోట్లు కేటాయించింది. భువనగిరి ఖిలాపైకి రోప్ వే నిర్మాణం ద్వారా పర్యాటకులను ఆకర్శించాలన్నది కేంద్ర ప్రభుత్వ సంకల్పం. వరంగల్, యాదాద్రి,కొలనుపాకకు వచ్చిపోయే వేలాది మందిని ఇక్కడికి ఆహ్వానించే కార్యక్రమం చేపడుతున్నారు. అలాగే ఖిలాపై పర్యాటకుల కోసం వివిధ వసతులు కల్పించనున్నారు. అందులో ప్రధానంగా చిన్నపిల్లలకు ఆట పరికరాలు, మ్యూజియం, నీటి కొలను సుందరీకరణ, రెస్టారెంట్లు, మంచినీటి సౌకర్యం, కోట చారిత్రకతను తెలిపే లేజర్ షో వంటివి ఏర్పాటు చేయనున్నారు. ఖిలా దిగువ భాగంలో మంచినీటి సౌకర్యం, వాష్ రూంలు, రెస్టారెంట్ ఏర్పాటు చేయనున్నారు. ఇందుకు సంబంధించి డీపీఆర్ రూపొందించే బాధ్యతలను ఎల్‌అండ్‌టీ సంస్థకు కేంద్ర ప్రభుత్వం అప్పగించింది. ఇందులో భాగంగా కంపెనీ ప్రతినిధులు ఇటీవల కలెక్టర్ పమేలా సత్పతిని కలిసి చర్చించారు.

### ఖిలా చరిత్ర ఇదీ..

చరిత్రలో తెలంగాణను ఏలిన అందరి ఏలుబడిలో భువనగిరి ప్రాంతం వుంది. మూసీ నది ప్రాంతాన్ని జయించిన మహాపద్మనందులు, ఆ తర్వాత మౌర్యులు, పిదప మహిషకుడు ఖారవేలుడి ఏలుబడిలో వుండి వుంటుంది భువనగిరి. శాతవాహనుల నుంచి ఆసఫ్జాహీల దాకా వివిధ రాజుల రాజ్యాల్లో భువనగిరి భాగమై వుంది. శాసనాల దాఖలా ప్రకారం క్రీ.శ.1100కు ముందునుండే భువనగిరి దుర్గం కళ్యాణ చాళుక్యుల పాలనలో వుంది. అప్పుడిది కొలనుపాకకు రక్షణ, ప్రధానంగా సైనిక దుర్గంగా ఉన్నట్లు చరిత్ర చెబుతుంది.

### బోనయ్య, గిరమ్మల పేరున నిర్మించిందే భువనగిరి కోట

జానపదుల పేరు మీద ఏర్పడ్డదే భునగిరి ఖిలా. అప్పట్లో ఒక రాజు ఇప్పటి రాయగిరి రైల్వేస్టేషన్ (ఒకప్పటి తిరుమలగిరి తండా) దగ్గరి మల్లన్నగుట్ట మీద కోట కట్టబోతుంటే బోనయ్య అనే గొల్లాయన ఈడ కోటేం కట్టరుగని మీకు మంచి జాగ జూపిస్త రమ్మని తీసుకపోయి బోనగిరిగుట్టను చూపెట్టిండంట. దాని మీది కప్పివున్న తీగెలపాద మొదలు హనుమాపురం వరకు ఉండెనట. దాన్ని నరికి రాజుకు గుట్ట చూపెడితే రాజు రాయిగిరిలో కోట కట్టుడాపి బోనగిరిగుట్ట మీద ఖిల్లా నిర్మించిండట. రాజు ఇనామిస్తనంటే బోనయ్య తన పేరు, తన భార్య పేరు గిరమ్మ కలిసొచ్చేటట్లు ఊరు కట్టియ్యమన్నడంట. దీంతో రాజు తథాస్తన్నడు. బోనయ్య, గిరమ్మల పేరుమీద 'బోనగిరి'ని కట్టించిండు రాజు. ఆ బోనగిరే ఇప్పుడు భువనగిరిగా పిలువబడుతున్నది.

### రాక్ క్లైంబింగ్, ర్యాప్లింగ్‌లో శిక్షణ

రాక్ క్లైంబింగ్, ర్యాప్లింగ్ సాహసికులకు భువనగిరి కోట వేదికగా మారింది. హైదరాబాద్‌తో పాటు వివిధ ప్రాంతాల నుంచి శిక్షణ పొందడానికి పెద్ద ఎత్తున వస్తుంటారు. శిక్షణ ఇవ్వడానికి నలుగురు కోచ్‌లు ఉన్నారు. జూలై నుంచి ఫిబ్రవరి వరకు ఇక్కడ శిక్షణ ఇస్తారు.


**మాలోతు పూర్ణా, ఆనంద్ ఇక్కడే కోచింగ్**

సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాలల విద్యార్థులు మాలోతు పూర్ణా, ఆనంద్ భువనగిరి ఖిలా వద్దనే ప్రాథమిక శిక్షణ పొందారు. పూర్ణా అతి చిన్న వయసులో ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించి రికార్డు సృష్టించారు. ఈమెతో పాటు ఇక్కడ శిక్షణ పొందిన సుమారు 90 మంది ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించి జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. అలాగే కిలిమంజారో పర్వతాన్ని 300 మంది. మౌంట్ ఎల్‌బ్రోస్ పర్వతాన్ని 100 మంది వరకు అధిరోహించారు. ప్రపంచంలోని ఏడు ఖండాల్లో ఉన్న ఎత్తయిన పర్వతాలను అధిరోహించడానికి ఇక్కడ శిక్షణ ఇస్తున్నారు. సాఫ్ట్‌వేర్ రంగం, ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల విద్యార్థులు, కార్పొరేట్ సంస్థల ప్రతినిధులు సుమారు 10,000 మంది ఇక్కడ రాక్ క్లైంబింగ్, ర్యాప్లింగ్‌లో సర్టిఫికెట్ కోర్సులు పూర్తి చేశారు.


ఖిలాపై బురుజు

### ఆసియాలోనే రెండవ ఏక శిలా పర్వతం

ఆసియాలోనే రెండవ ఏక శిలా పర్వతం భువనగిరి కోట. 600 మీటర్ల ఎత్తున్న ఈ కోట పట్టు కోల్పోకుండా పర్వాతారోహకులు శిక్షణ పొందడానికి అనువుగా ఉంది. టెంజింగ్ నార్కె అవార్డు గ్రహీత శేఖర్‌బాబు 2013 సెప్టెంబర్‌లో భువనగిరి కోట వద్ద రాక్ క్లైంబింగ్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. ఐదు సంవత్సరాల నుంచి 65 ఏళ్ల వయస్సు వారికి ఇక్కడ నాలుగు విభాగాల్లో శిక్షణ ఇస్తారు. రాక్ క్లైంబింగ్( కొండను ఎక్కడం) ర్యాప్లింగ్( కొండపైనుంచితాడుతో దిగడం) జిప్‌లైన్( తీగమీద వెళ్లడం), క్యాంపింగ్ (టెంట్‌లో వసతులు ఏర్పాటు,నిద్ర వంటి ) విషయాలపై శిక్షణ ఇస్తున్నారు. గ్రేడ్‌ల వారీగా శిక్షణ ఇస్తారు. ఒకరోజ, రెండు రోజులు, ఐదు రోజులు సర్టిఫికెట్ కోర్సులు, అడ్వాన్స్ శిక్షణ కూడా ఇస్తారు. రాక్ క్లైంబింగ్‌లో శిక్షణ పూర్తయిన అనంతరం హిమాలయల్లోని పర్వత సానువుల్లో శిక్షణ ఇప్పించి పర్వాతారోహణకు పంపిస్తారు. ఇందుకోసం రాక్ క్లైంబింగ్ నిర్వాహకులు ఫీజు తీసుకుంటారు. రాక్ క్లైంబింగ్ కోసం ట్రైనీ ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు తదితర ప్రముఖులు సైతం వస్తుంటారు. వేసవిలో బండ వేడెక్కుతుండడంతో మార్చి నుంచి జూన్ వరకు శిక్షణ నిలిపివేస్తారు.


ఖిలాపై నీటితో కళకళలాడుతున్న కొలను



# కుక్కడంలో తాళం వేసిన ఇంట్లో చోరీ

- తులంన్నర బంగారం, 15 తులాల వెండి, రూ. 18 వేల నగదు అపహరణ

మాడుగులపల్లి: తాళం వేసిన ఇంట్లో దుండగులు చోరీకి పాల్పడ్డారు. తులంన్నర బంగారం, 15 తులాల వెండి ఆభరణాలు, రూ. 18 వేలు అపహరించారు. మండలంలోని కుక్కడం గ్రామంలో ఈ ఘటన జరగ్గా బుధవారం వెలుగులోకి వచ్చింది. రామన్నపేట మండలం పల్లివాడ గ్రామానికి చెందిన దేశపాక జగపతిబాబు మూడేండ్లుగా ఇటిక్యాల గ్రామ పరిధిలోని ఓ రైస్‌మిల్లు డ్రైవర్‌గా పనిచేస్తూ కుక్కడం గ్రామంలో భార్య పిల్లలతో కలిసి అద్దెకు ఉంటున్నాడు. స్వగ్రామంలో బొడ్రాయి ప్రతిష్ఠ ఉండడంతో గత నెల 30న ఇంటికి తాళం వేసి వెళ్లారు. బుధవారం మధ్యాహ్నం తిరిగి రాగా ఇంటి తలుపుల తాళాలు పగులగొట్టి ఉన్నాయి. గదిలో వస్తువులు, బట్టలు చిందరవందరగా పడి ఉన్నాయి. సెల్ఫ్‌లో బట్టల కింద ప్లాస్టిక్ డబ్బాలో దాచిన బంగారు ఉంగరాలు, వెండి ఆభరణాలు, నగదు కనిపించలేదు. దాంతో చోరీ జరిగినట్లు నిర్ధారించుకొని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఘటనాస్థలాన్ని పరిశీలించారు. కాగా ఇటీవల ఇదే గ్రామానికి చెందిన ఓ మహిళ ఇంట్లో చోరీకి చేసిన దుండగులు నగదు అపహరించారు. ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల బీరువాలను సైతం ధ్వంసం చేసి క్రీడా సామగ్రి ఎత్తుకెళ్లారు. వరుస దొంగతనాలతో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


చిందరవందరగా వస్తువులు

## చనిపోతూ మరో ఐదుగురికి ప్రాణదానం

- చౌటుప్పల్ మండలం జైకేసారానికి చెందిన గీత కార్మికుడి బ్రెయిన్ డెడ్
- జీవన్‌దాన్ ఫౌండేషన్‌కు అవయవాల దానం
- పెద్ద మనసుతో ముందుకు వచ్చిన కుటుంబ సభ్యులు


భార్య, కుమారుడితో చంద్రయ్య

చౌటుప్పల్ : చౌటుప్పల్ మండలం జైకేసారం గ్రామానికి చెందిన పందుల చంద్రయ్యగౌడ్(60) తాను చనిపోతూ మరో ఐదుగురికి అవయవ దానం చేశాడు. గీత వృత్తితో పాటు కొద్దిపాటిగా ఉన్న భూమిలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. ఈనెల 11న అకస్మాత్తుగా బ్లడ్ ప్రెషర్‌కు గురయ్యాడు. దీంతో చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని కామినేని ఆసపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స సమయంలో మంగళవారం బ్రెయిన్‌డెడ్‌కు గురయ్యాడు. వైద్యులు ఈ విషయాన్ని భార్య అండాలుతో పాటు, ఇతర కుటుంబ సభ్యులకు తెలియజేశారు. ఆ క్రమంలో కుటుంబ సభ్యులంతా కలిసి అవయవ దానం చేయాలని నిర్ణయించుకున్నారు. అందులో భాగంగా జీవన్‌ధాన్ ఫౌండేషన్‌కు కిడ్నీలు, కళ్లు, లీవర్ దానం చేశారు. తాను ఈ లోకాన్ని విడిచి వెళ్లిపోతూ మరో ఐదుగురికి ప్రాణదానం చేసిన లక్ష్మయ్యను, అందుకు ముందుకు వచ్చిన ఆయన కుటుంబ సభ్యులను పలువురు అభినందించారు.

## గ్యాస్ సిలిండర్ లీకై గుడిసె దగ్ధం

మునగాల(కోదాడ): మునగాల మండలం ఆకుపాముల గ్రామంలో బుధవారం గ్యాస్ సిలిండర్ లీకై మంటలు అంటుకుని పూరిగుడిసె దగ్ధమైంది. ఆకుపాముల గ్రామానికి చెందిన గీత కార్మికుడు దొంతగాని శ్రీను భార్య రాములమ్మ తమ పూరి గుడిసెలో వంట చేస్తూ చిన్న పని నిమిత్తం బయటికి వెళ్లింది. తిరిగి వచ్చేలోపై గ్యాస్ సిలిండర్ లీకై మంటలు తాటాకు కమ్మలకు అంటుకున్నాయి. మంటలు వ్యాపించి చూస్తుండగానే గుడిసె కాలిపోయింది. ప్రమాదంలో రూ.90వేల నగదు, రెండు తులాల బంగారం, వీరి కుమారుడు నాగరాజు విద్యార్హత సర్టిఫికెట్లు, ఇతర సామగ్రి అగ్నికి ఆహుతయ్యాయి. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి వచ్చి మంటలను ఆర్పారు. బాధిత కుటుంబాన్ని గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ విలాసకవి రామరాజు కుమారుడు రమేష్ రాజు రూ.10వేలు, ఇంటెలిజెన్స్ డీఎస్పీ అమరగాని కృష్ణయ్య, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మల్లెబోయిన అంజి యాదవ్ రూ.5వేల చొప్పున ఆర్థికసాయం, కోదాడ నియోజకవర్గ బీఎస్పీ పిల్లుట్ల శ్రీనివాస్ నెలకు సరిపడా నిత్యావసర సరుకులు అందజేశారు.


బాధితుడికి ఆర్థికసాయం అందజేస్తున్న డీఎస్పీ కృష్ణయ్య

## అన్నదానానికి విరాళం

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి సన్నిధిలోని దీక్ష పరుల మండపంలో నిర్వహిస్తున్న అన్నదానానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అక్వా డెవలప్‌మెంట్ అథారిటీ (అప్సడా) వైస్ చైర్మన్ వడ్డి రఘురామ్ రూ.1,01,116లు విరాళముగా అందజేశారు. బుధవారం కుటుంబ సభ్యులతో కలిసి యాదాద్రీశుడిని దర్శించుకున్న వడ్డి రఘురామ్ గర్భాలయంలో స్వయంభూలను దర్శించుకున్నారు. అనంతరం ఆయనకు ఆచార్యులు వేద ఆశీర్వచనం చేయగా, అధికారులు లడ్డూ ప్రసాదం అందజేశారు.

## స్వామి నిజాభిషేకంలో ఉప లోకాయుక్త నిరంజన్‌రావు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో వేకువజామునే జరిగే స్వామివారి నిజాభిషేకంలో తెలంగాణ రాష్ట్ర ఉప లోకాయుక్త నిరంజన్‌రావు కుటుంబ సమేతంగా పాల్గొన్నారు.బుధవారం వేకువజామునే స్వామిని దర్శించుకొని నిజాభిషేకాన్ని వీక్షించారు. స్వయంభూ, ప్రతిష్ఠామూర్తులను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. నిరంజన్‌రావుకు ఆచార్యులు వేద ఆశీర్వచనం చేయగా, అధికారులు లడ్డూ ప్రసాదం అందజేశారు.

## మూసీకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

కేతేపల్లి: మూసీ ప్రాజెక్టుకు ఎగువ నుంచి ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. దీంతో అధికారులు ప్రాజెక్టు ఒక క్రస్టు గేటును పైకెత్తి నీటిని దిగువకు వదులుతున్నారు. బుధవారం ఎగువ నుంచి మూసీ ప్రాజెక్టుకు 150 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టులో నీటిమట్టం 645 అడుగుల గరిష్ఠస్థాయికి చేరువలో ఉండటంతో పాటు వర్షాకాలం సీజన్ ప్రారంభ సమయం కావటంతో ప్రాజెక్టులో నీటిమట్టాన్ని తగ్గించాలని అధికారులు నిర్ణయించారు. దీంతో ప్రాజెక్టు 3వ నంబరు క్రస్టు గేటును అర అడుగు మేర పైకెత్తి ఉంచి 300 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. మూసీ ప్రాజెక్టు ప్రస్తుత నీటిమట్టం 644.30 అడుగుల వద్ద ఉంది.

# మతిస్థిమితం లేని మహిళ దారుణ హత్య

- బలమైన ఆయుధంతో తలపై మోదడంతో మృతిచెందినట్లు ఆనవాళ్లు
- మద్యం మత్తులోనే ఘాతుకానికి తెగబడి ఉంటారని అనుమానాలు
- హతురాలు రంగారెడ్డి జిల్లా వాసి


యాదమ్మ (ఫైల్)

భూదాన్‌పోచంపల్లి : యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండలం పిలాయిపల్లిలో మతిస్థిమితంలేని మహిళ దారుణ హత్యకు గురైంది. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మెట్టు మండలం, చిన్నరావిరాల గ్రామానికి చెందిన సోమని యాదమ్మ(55) ఐదేళ్లుగా మతిస్థిమితం సరిగా లేక సమీపంలో ఉన్న గ్రామాల్లో తిరుగుతోంది. ఆమె 15రోజులుగా పిలాయిపల్లి గ్రామంలో తిరుగుతూ అడుక్కొని తింటూండేది. మంగళవారం రాత్రి గ్రామ సమీపంలోని ఓ వైన్స్ ఎదురుగా ఉన్న ఓ భవనం వెనుకాల సెల్లార్‌లో నిద్రిస్తుండగా గుర్తుతెలియని వ్యక్తులు ఆమె తలపై మోదారు. దాంతో తీవ్ర రక్తస్రావమై ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. బుధవారం మధ్యాహ్నం వైన్స్‌షాపులో మద్యం కొనుగోలు చేయడానికి వచ్చిన ఓ వ్యక్తి మూత్ర విసర్జనకు అటుగా వెళ్లగా వివస్త్ర స్థితిలో పడి ఉన్న ఓ మహిళా మృతదేహం కన్పించింది. వెంటనే సర్పంచ్ అందెల హరీష్‌కు తెలపడంతో ఆయన పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. అలాగే క్లూస్‌టీమ్, డాగ్‌స్క్వాడ్ పిలిపించారు. డాగ్‌స్క్వాడ్ గ్రామశివారులో రోడ్డు పక్కన ఉన్న బావి వద్దకు వచ్చి ఆగిపోయింది. తల పగిలి ఉండటంతో దేనితో హత్య చేశారని తెలియరాలేదు. సంఘటనా స్థలంలో కూడా ఎలాంటి ఆధారాలు లభించలేదు. చివరకు వైన్స్ షాప్ ఏర్పాటు చేసిన కెమెరాల్లోని సీసీ ఫుటేజీని పరిశీలించినా, అందులో ఎలాంటి అనవాళ్లు రికార్డు కాలేదు. ఎవరో మద్యం మత్తులో ఈ ఘాతుకానికి పాల్పడి ఉండవచ్చునని పోలీసులు అనుమానిస్తున్నారు. అయితే స్థానిక ఓ పరిశ్రమలో పనిచేస్తున్న బిహార్ రాష్ట్రానికి చెందిన ఓ యువకుడిని అనుమానించి పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ విక్రమ్‌రెడ్డి తెలిపారు. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు. భర్త లింగయ్య మాత్రం గతంలో అనారోగ్యంతో మృతిచెందాడు.

## ఐదు తరాల నడుమ 100వ పుట్టిన రోజు వేడుకలు


లక్ష్మమ్మ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న కుటుంబ సభ్యులు

చౌటుప్పల్ : యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండల పరిధిలోని జైకేసారం గ్రామపంచాయితీ మధిర పెద్దబావిగూడెంలో బొడ్డు లక్ష్మమ్మ బుధవారం తన 100వ పుట్టినరోజు వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. వేడుకలకు తన కుమారుడు, నలుగురు కుమార్తెలకు చెందిన ఐదుతరాల కుటుంబ సభ్యులంతా వచ్చారు. అందరి సమక్షంలో లక్ష్మమ్మ కేక్ కట్ చేశారు. సంపూర్ణ ఆరోగ్యంగా ఉన్న లక్ష్మమ్మ ఆనందోత్సాహాల నడుమ జన్మదినాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. చాలా ఏళ్ల తర్వాత ఈ కుటుంబ సభ్యులంతా లక్ష్మమ్మ జన్మదినాన్ని పురస్కరించుకొని ఒక్క చోట కలిశారు. ఈ వేడుకలు తమ జీవితంలో గుర్తుండిపోతాయని చెప్పారు.

# వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి మృతి


ప్రతాప్ (ఫైల్)

బొమ్మలరామారం : వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు దుర్మరణం చెందారు. బొమ్మల రామారం, మిర్యాలగూడ, గుర్రంపోడు మండలాల పరిధిలో చోటు చేసుకున్న ఈ ఘటనల వివరాలు ఇలా ఉన్నాయి. బొమ్మల రామారం మండలంలోని గోవింద్ తండాకు చెందిన మేగావత్ ప్రతాప్ ప్లంబర్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు.రోజు వారీగానే హైదరాబాద్‌లో పనులు ముగించుకొని బైక్‌పై స్వగ్రామానికి వస్తున్నాడు. ఈ క్రమంలో మండలంలోని చీకటిమామిడి గ్రామ శివారులో గల ఇండియన్ పెట్రోల్ బంక్ సమీపంలో హైదరాబాద్ వైపు వెళ్తున్న కారు చీకటిమామిడి వైపు వస్తున్న ప్రతాప్ బైక్‌ను ఢీ కొట్టింది.తీవ్ర గాయాలైన ప్రతాప్‌ను చికిత్స నిమిత్తం భువనగిరి జిల్లా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

**నిలిచున్న లారీని ఢీకొని..**

మిర్యాలగూడ టౌన్: మిర్యాలగూడ పట్టణంలోని వినోభానగర్‌కు చెందిన ఎం. లక్ష్మయ్య(35) బైక్‌పై దామరచర్ల మండల కేంద్రంలో అంత్యక్రియలకు వెళ్లి వస్తుండగా మిర్యాలగూడ మండలం కొత్తగూడెం గ్రామ శివారులో ఎస్‌ఆర్‌ఆర్ ఫంక్షన్‌హాల్ వద్ద రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొట్టాడు. దీంతో లక్ష్మయ్య తలకు తీవ్రగాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడు మిర్యాలగూడ పట్టణంలోని శాంతినికేతన్ డిగ్రీ కళాశాలలో పనిచేస్తున్నట్లు తెలిసింది. మృతుడి భార్య స్వాతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడికి ఇద్దరు పిల్లలున్నారు.

**ఆటో ఢీకొని..**

గుర్రంపోడు : ఆటో ఢీకొని వృద్ధుడు మృతిచెందాడు. గుర్రంపోడు మండలం పోచంపల్లి గ్రామానికి చెందిన కొప్పోజు మల్లయ్య(70) బుధవారం ఇంటిముందు కూర్చున్నాడు. ఈ క్రమంలో ఆటో అదుపుతప్పి మల్లయ్యను ఢీకొట్టడంతో గాయపడ్డాడు. అతడిని దేవరకొండ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శివప్రసాద్ తెలిపారు.